సాక్షి
అనకాపల్లి
శుక్రవారం ၊ 1 ၊ ఆగస్టు ၊ 2025



ఇదేం సాగునీటి సరఫరా?

పూడికతీత జరగక రైవాడ నీరు విడుదల చేసి మూడు రోజులు గడుస్తున్నా పలు గ్రామాలకు సాగునీరు అందలేదు. 8లో



ఎన్టీపీసీలో డీఆర్‌ఎం

తాటిచెట్లపాలెం: డీఆర్‌ఎం లలిత్ బోహ్రా గురువారం ఎన్టీపీసీని సందర్శించారు. రైల్వే సైడింగ్ కార్యాలయంలో తనిఖీలు చేశారు.



సిరులతల్లికి పూజలు

విశాఖ: కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం 7వ రోజున గురువారం శ్రీలక్ష్మి పూజలు ఘనంగా జరిగాయి.

నిర్వాసితుల నిరసన స్వరం

పరిహారం పరిహాసంగా మారింది.. ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘించడంతో నిర్వాసితుల కడుపు మండింది. అర్హుల గుర్తింపులో అవకతవకలు, వారసులందరికీ అందని సాయం వారి ఆగ్రహావేశాలకు కారణమైంది. అందుకే ఇళ్ల స్థలాల కేటాయింపు కార్యక్రమాన్ని బహిష్కరించారు. వేదిక ఎదుటే తమ నిరసన వ్యక్తం చేశారు.

- ఇళ్ల స్థలాలు తీసుకునేందుకు నిరాకరణ
- రూ.25 లక్షల ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ కోసం పట్టు
- వేదిక ముందు బైఠాయింపు
- అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ, సీపీఎం నేతలు



వేదిక ముందు బైఠాయించిన నిర్వాసితులు, అఖిలపక్ష నేతలు

నక్కపల్లి: పరిశ్రమల కోసం తాము పుట్టి పెరిగిన ఇళ్లను, ఊళ్లను వదులుకున్న నిర్వాసితుల్లో ఆవేదన రగిలింది. తమకు న్యాయం చేయాలన్న చిత్తశుద్ధి కూటమి సర్కారుకు లేకపోవడం, అధికారులు పాలకుల అడుగులకు మడుగులు ఒత్తడంతో తమకు న్యాయం జరిగే పరిస్థితి లేదని వారికి అర్థమయింది. అందుకే ఇళ్ల స్థలాలు ఇస్తున్నా తీసుకోలేదు. తమ డిమాండ్లు నెరవేర్చాలని పట్టుబడుతూ నిరసన తెలిపారు. బల్క్ డ్రగ్ పార్క్, స్టీల్‌ప్లాంట్ కోసం నివాస ప్రాంతాలు కోల్పోయిన వారికి పునరావాసం కింద నక్కపల్లి మండలంలోని పెదబోదిగల్లం వద్ద 151 ఎకరాలు కొనుగోలు చేసి ప్రభుత్వం లేఅవుట్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గురువారం పాటిమీద గ్రామంలో నర్సీపట్నం ఆర్డీవో వి.వి. రమణ అధ్యక్షతన ఇళ్ల స్థలాల కేటాయింపు కార్యక్రమం జరిగింది. జిరాయితీ భూముల్లో ఇళ్లు కోల్పోయిన వారి కుటుంబాల్లో యజమానితో పాటు, ఇంట్లో మేజర్ కుమారుడు, అవివాహితులైన ఆడపిల్లలకు ఐదు సెంట్ల చొప్పున ఇంటి స్థలం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.8.98 లక్షల ఆర్థిక సాయం అందించనున్నారు. ముందుగా నిర్వాసితుల సమక్షంలో లాటరీ విధానంలో ప్లాట్లు కేటాయించే ప్రక్రియ చేపట్టారు. ఆర్డీవో మాట్లాడుతూ మండలంలోని ఐదు గ్రామాల్లో 290 కుటుంబాలకు చెందిన 745 మంది నిర్వాసితులను గుర్తించామని చెప్పారు. వీరిలో బుచ్చిరాజుపేటలో 30 కుటుంబాలకు చెందిన 92 మంది, చందనాడలో 119 కుటుంబాలకు చెందిన 329 మంది, డీఎల్ పురంలో 6 కుటుంబాలకు చెందిన 21 మంది, రాజయ్యపేటలో 53 కుటుంబాలకు చెందిన 108 మంది, వేంపాడులో 82 కుటుంబాలకు చెందిన 195 మంది ఉన్నారు.



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు, నిర్వాసితులు

మండుటెండలో బైఠాయింపు

తమ సమస్యలు పూర్తిగా పరిష్కరించకుండా ప్లాట్లను కేటాయించడం తగదని, తాము బహిష్కరిస్తున్నామని వేదిక వద్ద నుంచి వందలాది మంది నిర్వాసితులు వెళ్లిపోయి, ఎదురుగా మండుటెండలో బైఠాయించారు. ఆర్డీవో రమణ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కొప్పిశెట్టి వెంకటేష్‌లు మాట్లాడుతూ ఈ డిమాండ్లను హోం మంత్రి అనిత ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుత సర్వేలో లోపాలను సరిచేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. నిర్వాసితుల ఆందోళన జరుగుతున్న సమయంలోనే అధికారులు పోలీస్ బందోబస్తు మధ్య టీడీపీ అనుకూలురైన వారితో లాటరీ ద్వారా ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశారు. తమ డిమాండ్లతో నిర్వాసితులు ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చారు. ఈ ఆందోళనలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, సర్పంచ్ తళ్ల రోహిణి, ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, ఐదు గ్రామాల నిర్వాసితులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన నిరసన

లాటరీ వేసి ఇంటి స్థలాల కేటాయింపునకు సిద్ధమైన అధికారుల ప్రయత్నాన్ని నిర్వాసితులు అడ్డుకున్నారు. వారికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు సూరాకాసుల గోవిందు, రైతు నాయకుడు తళ్ల భార్గవ్ అండగా నిలిచారు. అర్హులైన వారిలో చాలా మందికి ప్లాట్లు కేటాయించలేదన్నారు. నష్టపరిహారం, ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ విషయంలో 2013 భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘించారని అభ్యంతరం చెప్పారు. భూసేకరణ నోటిఫికేషన్ విడుదల నాటికి ఇంట్లో ఉన్న కుమార్తెలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన పదేళ్ల తర్వాత భూములు స్వాధీనం చేసుకున్నారని, రైతుల కుటుంబాల్లో ఆడపిల్లలకు వివాహాలయ్యాయన్నారు. వారి పేర్లు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీలో చేర్చలేదన్నారు. ఈ సమస్యలను ఏడాది నుంచి అధికారుల దృష్టికి తీసుకు వస్తూ, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షలు చెల్లించాలని ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోలేదన్నారు.

రైతులను మోసగించారు..



ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై స్పష్టత ఇవ్వకుండా ప్లాట్లు కేటాయించడం తగదు. ప్రభుత్వం రైతులను మోసం చేసింది. ఏడాది నుంచి ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణం.

–వీసం రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేత

ఆడపిల్లలకు అన్యాయం



గతంలో పెళ్లి కాని ఆడపిల్లలకు ప్యాకేజీ ఇస్తామన్నారు. వారికి వివాహాలయ్యాయి. వారి పేర్లు జాబితాలో లేవు. ఆర్ కార్డులు ఇస్తామన్నారు. ఇవ్వలేదు. ప్యాకేజీ పెంచకుండా ప్లాట్లు కేటాయించడం తగదు.

–అప్పలరాజు, సీపీఎం నాయకుడు

ఇదెక్కడి న్యాయం?



నాకు తమ్మయ్యపేటలో సర్వే నెంబరు 104లో ఒక ఇల్లు సర్వే నెంబరు 102లో ఒక ఇల్లు ఉంది. రెండింటికీ పరిహారం ఇవ్వలేదు. అన్ని ఆధారాలు సమర్పించినా న్యాయం జరగలేదు.

–రావి శ్రీను, నిర్వాసితుడు

హామీ నిలుపుకోండి



మేము తండ్రీ కూతుళ్లం. జాబితాలో మా పేర్లు లేవు. మరో ఇద్దరు కుమార్తెల పేర్లు కూడా లేవు. వివాహం అయినందున ప్యాకేజీ, ప్లాటు ఇవ్వడం లేదని చెప్పారు. గతంలో ఇస్తామని హామీ ఇచ్చారు.

–మడుగుల అప్పారావు, తుంపాల దేవి, తమ్మయ్యపేట

కందిపప్పుకు మంగళం!

- ఏడు నెలలుగా అందించని రాష్ట్ర ప్రభుత్వం
- 546 మెట్రిక్ టన్నుల సరఫరాకు ఎగనామం
- సామాన్యులపై రూ.45 కోట్ల భారం



అనకాపల్లి టౌన్: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కందిపప్పు పంపిణీకి మంగళం పాడేసింది. గత ఏడు నెలలుగా కందిపప్పును రేషన్ డిపోల ద్వారా సరఫరాను నిలిపివేసింది. కందిపప్పు కొనుగోలుకు టెండర్లు పిలవడం ఆలస్యమవుతుందని అధికారులు చెబుతున్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చేస్తున్న ప్రయత్నాలు కనిపించడంలేదు. దీంతో జిల్లాలో ఉన్న పేదవారిపై కోట్ల రూపాయల భారం పడుతుంది. కందిపప్పు బలవర్ధకమైన ఆహార పదార్థం. చక్కగా ప్రొటీన్ లభిస్తుంది. సామాన్యుల దగ్గర నుంచి డబ్బున్నవాడు వరకూ కందిపప్పును విరివిగా వాడుతుంటారు. సామాన్యుడు చౌకధరల దుకాణంలో లభించే కందిపప్పు కోసం ఎదురు చూస్తుంటారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు నెలలుగా రేషన్ షాపులలో కందిపప్పు, రాగులు, గోధుమపిండి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. రాగులు, గోధుముల సంగతి పక్కన పెడితే కనీసం కందిపప్పు సరఫరా చేయడంతో కూడా ప్రభుత్వం చేతులెత్తేసింది. ఈ నెల కూడా కందిపప్పును అడగొద్దని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 5,37,038 మంది కార్డుదారులకు 14,99,000 యూనిట్‌దారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 7652 మెట్రిక్ టన్నుల బియ్యం, 264 మెట్రిక్ టన్నుల పంచదార, 546 మెట్రిక్ టన్నుల కందిపప్పు, 544 మెట్రిక్ టన్నుల గోధుమ పిండి, 1628 మెట్రిక్ టన్నుల రాగులు సరఫరా చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఇవి నిలిచిపోయాయి. కొన్ని నెలలు అరకొరగా పంపిణీ చేసిన ప్రభుత్వం ఆరు నెలలుగా పూర్తిగా నిలిపివేసింది. పేదలకు నిత్యావసర వస్తువైన కందిపప్పును సరఫరా చేయలేని ప్రభుత్వం రాగులు, గోధుమ ఇంకేమి ఇస్తుందని కార్డుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీరు చూస్తుంటే రేషన్ షాపుల్లో పూర్తిగా కందిపప్పు నిలిపివేస్తుందేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యం కేంద్రం ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం కేవలం అరకేజీ పంచదార ఇచ్చి చేతులు దులిపేసుకుంటుంది. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర నాణ్యతను బట్టి 110 నుంచి రూ.120 ఉంటుంది. కూటమి నేతలు అధికారంలోకి రాక ముందు రేషన్ షాపులను బలోపేతం చేస్తామని నిత్యావసరాలైన బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమ పిండి, రాగి పిండి తదితర వాటిని రాయితీపై అందజేస్తామని ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో ఒక్క నెల కూడా సరుకులు సరఫరా చేయలేదేమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రజలకు మరింత సమాచారం అందించడం కోసం జిల్లా పౌరసరఫరా శాఖ అధికారి మూర్తిని ఫోన్‌లో సంప్రదించాలని ప్రయత్నం చేయగా అందుబాటులోకి రావడం లేదు.

తప్పుడు రిజిస్ట్రేషన్లపై తస్మాత్ జాగ్రత్త

కలెక్టర్ విజయ కృష్ణన్



అధికారులతో కలెక్టర్ విజయ కృష్ణన్ సమీక్ష

తుమ్మపాల: తప్పుడు రిజిస్ట్రేషన్లపై తరచు ఫిర్యాదులు వస్తున్నాయని, సబ్ రిజిస్ట్రార్లు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సబ్ రిజిస్ట్రార్లను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో ఆస్తి వివరాలు యజమానుల పేరున కాకుండా పొరపాటున వేరొకరి పేరున నమోదైతే అలాగే రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎల్‌పీఎం ఆధారంగా రిజిస్ట్రేషన్‌కు వచ్చిన ప్రతి డాక్యుమెంట్ విషయంలో లింక్, ఈసీ తప్పక చూసి పూర్వ యాజమాన్య హక్కులను ధ్రువీకరించుకోవాలన్నారు. జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మథరావు పాల్గొన్నారు.

2న అన్నదాత సుఖీభవ

అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకాల కోసం జిల్లాలో నేటి వరకు 2,31,688 మంది రైతులను అర్హులుగా గుర్తించినట్టు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లతో ఈ కార్యక్రమంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5 వేలు, పీఎం కిసాన్ కింద రూ.2 వేలు మొదటి విడతగా బ్యాంక్ ఖాతాలో జమ కానున్నాయన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

శతశాతం ప్రవేశాలు కల్పించాలి

జిల్లాలోని అన్ని సంక్షేమ పాఠశాలలు, కళాశాలల్లో శతశాతం ప్రవేశాలు కల్పించాలని, ప్రతి రోజు పక్కాగా మెనూ అమలు చెయ్యాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీ, మోడల్ కాలేజీ, మహాత్మా జ్యోతిరావ్ పూలె వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల, మోడల్ స్కూల్స్‌లో సీట్ల భర్తీ, మెనూ అమలుపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత వసతిగృహ అధికారులదేనన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ధర్నా



మాట్లాడుతున్న ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బోయిన చిన్నారావు

అనకాపల్లి: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న బోధనేతర, ఆర్థిక పరమైన 18 రకాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈ నెల 2న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నట్లు సంబంధిత జిల్లా చైర్మన్ బోయిన చిన్నారావు తెలిపారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధ్యాయులపై మోయలేని భారం వేసిందన్నారు. యాప్‌లతో ఇబ్బందుకు గురిచేయడం వల్ల విద్యార్థులకు సకాలంలో బోధన చేసేందుక సమయం సరిపోవడం లేదన్నారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేసినట్లయితే నాణ్యమైన విద్యనందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి యేశపోగు సుధాకర్ రావు, డిప్యూటీ జనరల్ కార్యదర్శి ఎస్. దుర్గాప్రసాద్, ఏపీటీఎఫ్ ప్రతినిధి ఆచంట రవి, ఎస్టీయూ ప్రతినిధి వత్సవాయి శ్రీలక్ష్మి, యూటీఎఫ్ ప్రతినిధి మట్ట శ్రీనివాసరావు, ఎస్సీఎస్టీయూఎస్‌ఏపీ ప్రతినిధి వై.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

తుమ్మపాల: ఆగస్టు నెలలో 2,58,120మందికి సామాజిక పింఛన్లు అందించేందుకు రూ.108.91 కోట్లు విడుదలైనట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తేదీ ఉదయం 6.30 గంటల నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకు వచ్చి నగదు పంపిణీ చేస్తారని తెలిపారు. పింఛను పొందుతూ చనిపోయిన వారి భార్యలు 4,596 మందికి కొత్తగా వితంతు పింఛన్ మంజూరైనట్టు తెలిపారు. లబ్ధిదారులందరూ 1, 2 తేదీలలో తమ గ్రామాలలో ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని ఆమె కోరారు.

హామీల అమలులో చిత్తశుద్ధి లేదు. స్థిరమైన విధానం లేదు. అర్హులందరికీ అందించాలన్న అంకిత భావం లేదు. సూపర్ సిక్స్ హామీల్లో అమలు చేసినవే కొన్ని.. అందులోనూ సవాలక్ష కొర్రీలు, విధి విధానాల్లో అస్పష్టత. మహిళలకు ఉచిత బస్సు పథకం విషయంలోనూ అదే జరుగుతోంది. మరో 15 రోజుల్లో అమలు కావాల్సిన కార్యక్రమానికి సంబంధించి సంబంధిత అధికారులకు ఇప్పటి వరకు సరైన మార్గదర్శకాలు ఇవ్వకపోవడంతో గందరగోళం నెలకొంది.





ఆంక్షల ప్రయాణం

ప్రయోజనం పరిమితం ■ ఉచిత బస్సుపై మహిళల కస్సుబుస్సు

అనకాపల్లి డిపో పరిధిలో..

మొత్తం బస్సులు	వీటిలో పల్లె వెలుగు
90	64


డీలక్స్	అల్ట్రా డీలక్స్
నిల్	నిల్

మెట్రో	సిటీ ఆర్డినరీ	ఎక్స్‌ప్రెస్
18	4	4

నర్సీపట్నం డిపో పరిధిలో

మొత్తం బస్సులు	వీటిలో పల్లె వెలుగు
93	49

అల్ట్రా డీలక్స్	డీలక్స్	ఎక్స్‌ప్రెస్
17	18	1



సాక్షి, అనకాపల్లి: మహిళలకు ఉచిత బస్సు పథకం జిల్లాకే పరిమితం అని ఒక మంత్రి.. రాష్ట్రమంతా తిరగొచ్చని మరో మంత్రి.. కొన్ని రకాల సర్వీసులనే అనుమతిస్తామని ఒకరు.. విధివిధానాలు రూపొందిస్తున్నామని మరొకరు.. ఇలా రకరకాలుగా మాట్లాడుతున్నారు. ఇంతకూ జిల్లాలో బస్సు సౌకర్యమే లేని గ్రామాలు 600కు పైగా ఉన్నాయి. ఆ గ్రామాల వారికి ఈ పథకం అందే అవకాశమే లేదు. కేవలం పల్లె వెలుగు, అల్ట్రా డీలక్స్ బస్సుల్లో మాత్రమే మహిళలను ఉచితంగా అనుమతిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి చెప్పారు. దాని ప్రకారం చూస్తే ఈ సదుపాయం చాలా పరిమితమని అర్థమవుతోంది. ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా ఇంతవరకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారులు చెబుతున్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలైనా ఏమిటీ గందరగోళమని మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అయోమయం.. గందరగోళం

- మరో 15 రోజుల్లో ప్రారంభించాల్సి ఉన్నా ఖరారు కాని మార్గదర్శకాలు
- అన్ని రకాల బస్సుల్లో అనుమతిస్తారో లేదో అనుమానం
- జిల్లాలో 600కు పైగా గ్రామాలకు బస్సే వెళ్లదు
- ఆ గ్రామాల మహిళలకు అందని ప్రయోజనం

ఎన్నో ఆంక్షలు..

ఏ పథకంలో ఎక్కడ పరిమితులు విధిద్దామా..? ఏ ఆంక్షలు పెడితే బావుంటుందా..? అని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు ఉంది. ఉచిత బస్సు పథకంలో ప్రతీ అంశంలోనూ ఆంక్షల మీద ఆంక్షలు పెడుతూ లీక్‌లు ఇస్తున్నారు. ఈ పథకాన్ని పల్లె వెలుగు, అల్ట్రా డీలక్స్ బస్సులకు మాత్రమే పరిమితం చేస్తే మరి దూర ప్రయాణాల సంగతేమిటి? జిల్లా దాటి వేరే జిల్లాకు ప్రయాణించాలంటే ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ సర్వీసులనే ఎక్కువగా ఆశ్రయిస్తుంటారు. వాటిలో ప్రయాణ సదుపాయం ఇవ్వకపోతే ఉపయోగమేంటని ప్రశ్నిస్తున్నారు. పల్లె వెలుగు బస్సులో ప్రయాణించడం కష్టమని పెదవి విరుస్తున్నారు.

బస్సులు తక్కువ.. మహిళలు ఎక్కువ

జిల్లాలో మహిళలు, ఐదేళ్ల నుంచి 18 ఏళ్ల వరకు వయసు గల బాలికలు మొత్తం 7,38,319 మంది ఉన్నారు. వీరిలో రోజుకు సగటున లక్ష నుంచి లక్షన్నర మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు ప్రజా రవాణా శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తే మహిళా ప్రయాణికుల సంఖ్య 2 లక్షల వరకు పెరిగే అవకాశాలున్నాయి. దీనికి తగ్గట్టుగా బస్సుల సంఖ్య లేకపోతే ఇబ్బందులు మొదలవుతాయి. నర్సీపట్నం, అనకాపల్లి డిపోల పరిధిలో మొత్తం 183 బస్సులు ఉన్నాయి. ఉచిత ప్రయాణం వల్ల మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగితే ఈ బస్సులు సరిపోవు. ఉన్న బస్సులు, సిబ్బందితోనే పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ప్రతి బస్సు వద్ద తోపులాటలు నిత్యకృత్యం కానున్నాయి. ఈ పథకాన్ని జిల్లాకే పరిమితం చేస్తే నెలకు రూ.4 కోట్ల చొప్పున ఏడాదికి రూ.48 కోట్ల ఆదాయాన్ని జిల్లా ఆర్టీసీ కోల్పోనుంది. రాష్ట్రమంతా అనుమతిస్తే నెలకు రూ. 5 కోట్ల చొప్పున ఏడాదికి రూ.60 కోట్లు కోల్పోవలసి వస్తుంది.

గ్రామీణ జనాభా అధికంగా ఉన్న అనకాపల్లి జిల్లాలో ఆర్టీసీ సేవలు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. డిపోల్లో బస్సుల కొరత తీవ్రంగా ఉంది. ఉన్న బస్సుల్లో చాలా వరకు కండీషన్లో లేవు. అనకాపల్లి, నర్సీపట్నం డిపోల పరిధిలో పలు బస్సులు రిపేర్లలో ఉన్నాయి. మరోవైపు డ్రైవర్లు, కండక్టర్ల పోస్టులు భారీగా ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిని భర్తీ చేయలేదు. ఏజెన్సీని అనుకుని ఉన్న నాతవరం, గొలుగొండ, రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట, మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ, కోటవురట్ల మండలాల పరిధిలో సుమారు 300కు పైగా గ్రామాలకు బస్సు సదుపాయం లేదు. అదేవిధంగా పారిశ్రామిక ప్రాంతంలో పాయకరావుపేట, యలమంచిలి, అచ్యుతాపురం, పరవాడ, రాంబిల్లి, అనకాపల్లి, కశింకోట, సబ్బవరం మండలాల్లో 200కు పైగా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్లే పరిస్థితి అసలే లేదు. జిల్లాలో 600కు పైగా గ్రామాల్లోని మహిళలకు ఉచిత ప్రయాణం అందని ద్రాక్ష కాగలదు.

క్లుప్తంగా

ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదు

మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీలో ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ గురువారం గవర్ల అనకాపల్లికి చెందిన పాలమ రెడ్డి సత్యనారాయణ తహసీల్దార్ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. తోటాడ పంచాయతీలోని సర్వే నెంబర్ 407/6లో 94 సెంట్ల భూమి అలాగే ప్రభుత్వ భూమి 30 సెంట్లను కలుపుకొని కొంతమంది లే అవుట్ వేసుకున్నారన్నారు. ఈ లే అవుట్‌లో అమాయక ప్రజలను మభ్యపెట్టి అమ్మకాలు చేస్తున్నారన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకొని సర్వే చేయించి ప్రభుత్వ భూమిని కాపాడాలని సత్యనారాయణ కోరారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ సంబంధిత సర్వే నెంబరులో ప్రభుత్వ భూమి ఎంత మేర ఉందో సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారు.

సబ్‌జైల్‌ను తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్

నర్సీపట్నం: స్థానిక సబ్‌జైల్‌ను సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ గురువారం తనిఖీ చేశారు. ఖైదీల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జైల్‌కు డాక్టర్లు రెగ్యూలర్‌గా వస్తున్నారా? భోజనం శుభ్రంగా పెడుతున్నారా అని ఖైదీలను ఆరా తీశారు. జైల్‌లో వసతులు ఏవిధంగా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారేఉ. మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చునని ఖైదీలకు సూచించారు. ఆయన వెంట న్యాయసేవ అధికార సంస్థ వలంటీర్లు శివప్రసాద్, జయ ప్రకాష్, ప్రసాద్ పాల్గొన్నారు.

కూటమి పొత్తులో మొదట రాజీ పడింది నేనే

- అనకాపల్లి ఎంపీ సీటు వదులుకున్నాను
- జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నాగబాబు

అనకాపల్లి: జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ కూటమి పొత్తులో రాజీ పడిన మొట్ట మొదటి వ్యక్తిని తానేనని, పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదేశించిన మరుక్షణమే అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడిగా పోటీ నుంచి తప్పుకున్నట్లు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. గురువారం స్థానిక గవరపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్లో పార్టీ ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి పొత్తు ధర్మమే ప్రథమ ప్రాధాన్యతగా నడుచుకోవాల్సిన బాధ్యత మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలకు ఉంటుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి జనసేన పార్టీ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. జనసేన ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, పంచకర్ల రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇదేం సాగునీటి సరఫరా?

- కాలువల పూడికతీత పనులను సకాలంలో చేపట్టడంలో అలసత్వం
- నీటి సరఫరాకు అడ్డుకట్ట వేసి పూడికతీత పనులు
- మూడు రోజులు గడుస్తున్నా పలు గ్రామాలకు అందని సాగునీరు
- రైవాడ ఆయకట్టు రైతుల పాలిట శాపంగా ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం



వేచలం, తారువ, మామిడిపల్లి గ్రామాలకు నీటి సరఫరాకు అడ్డుకట్ట వేసి పొక్లెయిన్‌తో పనులు చేపడుతున్న దృశ్యం



చేనులపాలెం సమీపంలో నీరు ప్రవహిస్తున్న కాలువలో పూడికతీత పనులు

దేవరాపల్లి: ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం.. రైవాడ జలాశయం ఆయుకట్టు రైతుల పాలిట శాపంగా మారింది. జలాశయం నుంచి ఖరీఫ్ సాగుకు నీటిని విడుదల చేసి మూడు రోజులు గడుస్తున్నా ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందని దుస్థితి నెలకొంది. జలాశయం పరిధిలోని పంట కాలువల్లో పూడికతీత, తుప్పలు, డొంకలు తొలగించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ ఆ పనులు సకాలంలో చేపట్టడంలో ఇరిగేషన్ అధికారులు విఫలమయ్యారు. ఖరీఫ్ పంటలకు సాగు నీటిని విడుదల చేపట్టడానికి ముందుగానే ఈ పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు అడుగడుగునా అలసత్వం ప్రదర్శించడంతో అసంపూర్తిగా మిగిలాయి. అధికార టీడీపీ నాయకులు ఈ పనులు చేపట్టడంతో పనుల పర్యవేక్షణకు అధికారులు అటుగా కన్నెత్తి చూడలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నీటి విడుదల తేదీని సుమారు రెండు వారాల క్రితమే ప్రకటించారు. ఈలోగా యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్లు మాత్రం నత్తనడకన చేపట్టారు.

నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసి పూడిక తీత పనులు

రైవాడ జలాశయం నుంచి ఎడమ కాలువ ద్వారా ఖరీఫ్ సాగుకు నీటి సరఫరా కొనసాగుతుంది. అయితే పెదనందిపల్లి శివారు సత్యనారాయణపురం సమీపంలోని ఎం.అలమండ, వేచలం వైపునకు వెళ్లే బ్రాంచి చానల్స్‌కు సంబంధించిన మదుం ఉంది. అక్కడి నుంచి ఎం.అలమండ వైపు సాగునీరు ప్రవహిస్తుండగా వేచలం వైపు బ్రాంచి కెనాల్‌కు అడ్డంగా మట్టి వేసి పూడికతీత, జంగిల్స్ తొలగింపు పనులను ప్రస్తుతం చేపడుతున్నారు. దీంతో వేచలం, మామిడిపల్లి, తారువ గ్రామాల పరిధిలోని సుమారు 3 వేల ఆయకట్టుకు సాగు నీరందని పరిస్థితి నెలకొంది. ఆయా గ్రామాల పరిధిలోని నారుమడులు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ఇప్పటికే నాట్లు వేసిన వరి పొలాలు నెర్రెలు బారి ఎండిపోతుండటంతో ఆయా ప్రాంతాల రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి విడుదలకు ముందుగానే ఈ పనులు చేపట్టాల్సి ఉండగా గతంలో ఎన్నడూ లేని విధంగా నీరు విడుదల చేసిన తర్వాత పనులు చేపట్టడంపై ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా చేనులపాలెం సమీపంలో నీరు ప్రవహిస్తున్న పంట కాలువలో జేసీబీతో పూడితతీత పనులు చేపడుతుండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రవహించే నీటిలో పూడిక ఎలా వస్తుందని, ఇలా మొక్కుబడి పనులు చేపట్టడం వల్ల నిధులు వృథా తప్పా ఎవరికి ప్రయోజనమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూడికతీత, జంగిల్స్ తొలగింపు పనులు మిగిలి ఉంటే తొలి దఫా నీటి విడుదల పూర్తయ్యాక చేపట్టాలి తప్పా.. ఒక చోట నీరు ప్రవహిస్తున్న కాలువలోను, మరో చోట కాలువకు నీటి సరఫరాను నిలిపి వేసి చేయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.



వేచలం సమీపంలో వెద పద్ధతిలో వేసిన వరి పంట

పనులు పూర్తి కాగానే నీటి సరఫరా

జలాశయం పరిధిలోని ఏడు కాలువల్లో పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్‌కు సుమారు రూ.52 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ పనులు సైతం దాదాపుగా పూర్తి చేశాం. వేచలం, మామిడిపల్లి, తారువ బ్రాంచి కెనాల్‌కు నీటి సరఫరాకు అడ్డుకట్ట వేయడం వాస్తవమే. రైతుల విజ్ఞప్తితో ఆ కాలువలో జేసీబీతో పూడిక, జంగిల్స్ తొలగింపు పనులు చేయిస్తున్నాం. పనులు పూర్తి కాగానే మూడు గ్రామాలకు సాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తాం. దేవరాపల్లి-చేనులపాలెం గ్రామాల మధ్య మేట వేయడంతో ప్రవహిస్తున్న కాలువలో జేసీబీతో తొలగింపు పనులు చేపడుతున్నాం.

– జి. సత్యంనాయుడు, ఇరిగేషన్ డీఈఈ

అధిక ఫీజుల వసూళ్లపై డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆందోళన



యలమంచిలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

యలమంచిలి రూరల్: అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వ, డిగ్రీ కళాశాల, స్థానిక తహసీల్దార్ కళాశాల ఎదుట బైటాయించి తమకు జరుగుతున్న అన్యాయాన్ని పరిష్కరించాలని కోరారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతుగా నిలిచారు. యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం బీఎస్సీ విద్యార్థుల నుంచి ఏడాదికి రూ.14,040, బీఏ, బీకాం విద్యార్థుల నుంచి రూ.13,840 వసూలు చేస్తున్నారని, గతేడాది కంటే ఫీజులు పెంచారని, అదనంగా ట్యూషన్, యూనివర్సిటీ ఫీజులు వంటివి తమ వద్ద నుంచి వసూలు చేస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఫీజుల గురించి తాము గానీ, తమ తల్లిదండ్రులు గానీ అడిగితే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారని, కొన్నిసార్లు తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని విద్యార్థులు విలేకరుల ఎదుట ఆరోపణలు చేశారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇచ్చారన్నారు. పెంచిన ఫీజుల భారం మోయలేకపోతున్నామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మైలపల్లి బాలాజీ మాట్లాడుతూ ఇప్పటి వరకు విద్యార్థుల వద్ద వసూలు చేస్తున్న అన్ని రకాల ఫీజులు, ఖర్చులపై ఉన్నతాధికారులు విచారణ చేసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. ప్రభుత్వం ఫీజులు పెంచడం, రీయింబర్స్ చేయకపోవడంతో పేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ వరహాలుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కృపానంద, లక్ష్మణ, కవిత, రమ్య, మహేష్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

దళితుడిపై టీడీపీ నాయకుడి దౌర్జన్యం



బాధితుడు చిందాడ దాసు

ఎస్.రాయవరం: హోంమంత్రి అనిత ఇలాకాలో ఓ దళితుడిపై గోకులపాడుకు చెందిన టీడీపీ నాయకుడు దౌర్జన్యానికి పాల్పడ్డాడు. దండోరా వేస్తుంటే తన డప్పు లాక్కున్నాడని బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోకులపాడు, గెడ్డపాలెం, తిమ్మాపురం గ్రామాలకు సాగునీటి కోసం జమ్మి, గ్రోయిన్ కాలువల్లో శ్రమదానం చేయడానికి రైతులు రావాలని దండోరా వేయాలని నిర్ణయించారు. ఈ మేరకు గోకులపాడు గ్రామానికి చెందిన రైతు పెనుగొల్లుకు చెందిన దండోరా వేసే చిందాడ దాసును తీసుకువెళ్లాడు. ముందుగా గెడ్డపాలెం, తిమ్మాపురం గ్రామాల్లో గురువారం దండోరా వేసిన దాసు.. గోకులపాడు గ్రామానికి రైతు నాగేశ్వరరావుతో చేరుకున్నాడు. అది గమనించిన టీడీపీ నాయకుడు సమ్మెంగి నానాజీ దండో ఎందుకు వేస్తున్నావు, ఈ గ్రామానికి ఎందుకు వచ్చావని ప్రశ్నించి బూతులు తిట్టి, డప్పు లాక్కున్నాడని బాధితుడు ఆరోపించాడు. ఈమేరకు దాసు ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

లారీపై దాడి చేసి చోరీకి యత్నం

కొంకోట: మండలంలోని నూతలగుంటపాలెం వద్ద గురువారం తెల్లవారుజామున ఒక లోడులారీపై అకస్మాత్తుగా దాడి చేసి దొంగతనానికి ప్రయత్నించిన దొంగలు కత్తితో ఒకరిని గాయపర్చి పరారయ్యారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు హైదరాబాద్ నుంచి జార్ఖండ్‌కు లోడు తీసుకువెళుతున్న ఓ లారీ నూతలగుంటపాలెం వద్ద జాతీయ రహదారి బే వద్దకు చేరిన తర్వాత విశ్రాంతి తీసుకోవడానికి డ్రైవర్ నిలిపాడు. ఈ సమయంలో లారీ కేబిన్‌లోకి దొంగలు అకస్మాత్తుగా చొరబడి దొంగతనానికి యత్నించారు. కత్తితో బెదిరించి దాడి చేసి బీహార్‌కు చెందిన లారీ డ్రైవర్ కుమారుడ్ని గాయపర్చినట్టు సమాచారం. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించారు. అయితే తర్వాత తమకు కేసు వద్దని లారీ డ్రైవర్, గాయపడిన బాధితుడు అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్స పొంది తమ గమ్యానికి వెళ్లిపోయినట్టు తెలిసింది. అయినప్పటికీ ఈ సంఘటనపై విచారణ చేపట్టి దొంగలను ఎలాగైనా పట్టుకోవాలని, ఇటువంటి దొంగతనాలకు చెక్ పెట్టాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఇటీవల కొంకోట పోలీసులు జిల్లాలోని 9 కేసుల్లో రూ.26 లక్షల విలువైన బంగారు గొలుసులు, మంగళ సూత్రాల దొంగతనాలకు సంబంధించిన నిందితులను పట్టుకొని ప్రశంసలు పొందారు. ఇదే తరహాలో లారీపై దాడి చేసి దొంగతనానికి యత్నించి కత్తితో గాయపర్చిన సంఘటన నేపథ్యంలో నిందితులను పట్టుకొని అరెస్టు చేసి మరోసారి తమ ప్రతిభను చూపాలని స్థానిక పోలీసులు భావిస్తున్నారు.

ఆనందపురంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కె.కోటపాడు: ఆనందపురంలోని వేచలపు చెరువు బంద ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించారు. వెంటనే సమాచారాన్ని ఎ.కోడూరు పోలీసులకు తెలియజేశారు. ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి 50 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, సుమారు 5 నుంచి 7 రోజుల క్రితమే మరణించి ఉండవచ్చునని ఎస్ఐ అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు గుండుతో పాటు టీషర్ట్, నీలం రంగు లుంగీని ధరించాడన్నారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో భద్రపరిచామని, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



చోడవరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

చోడవరం: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌ఓ) ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం ఆందోళన చేశారు. చోడవరం ఆర్టీసీ బస్టాండ్ నుంచి మెయిన్‌రోడ్డుపై వినాయకుడి గుడి మీదుగా కొత్తూరు జంక్షన్ వరకూ నిరసన ర్యాలీ చేశారు. అక్కడ విద్యార్థులంతా మానవహారం చేశారు. అక్కడ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు నందారపు భాస్కరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటి వరకూ ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు విడుదల చేయకపోవడం వల్ల కాలేజీలకు ఫీజుల కట్టలేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజులు కట్టలేక, సర్టిఫికెట్లు ఇవ్వక ఉన్నత చదువులకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. 117 జీఓను రద్దుచేస్తామని చెప్పిన విద్యాశాఖామంత్రి లోకేష్ ఇప్పటి వరకూ ఈ జీఓను రద్దుచేయలేదని వెంటనే రద్దుచేయాలని భాస్కరరావు డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు బి.కుమార్, గణేష్, మనోజ్, వై.రాజు, రామకృష్ణ, వరహాలనాయుడు పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై సీఈఓ విచారణ

ఎస్.రాయవరం: మండల పరిషత్ నిధులతో వరాహ నది పూడిక తీతపై వచ్చిన ఫిర్యాదుపై జిల్లా పరిషత్ సీఈఓ నారాయణరావు గురువారం విచారణ చేపట్టారు. ఇటీవల మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో వరాహ నదిలో పూడిక తీత పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. అదే క్రమంలో నర్సీపట్నం రోడ్డు సమీపంలో నిరుపయోగంగా శిథిలావస్థకు చేరిన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలన్న అర్జీపై కూడా ఆయన విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. ఈ విచారణలో తహసీల్దార్ రమేష్‌బాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

ఇంటర్మీడియట్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ మజ్జి ఆదినారాయణ



ప్రిన్సిపాళ్లతో మాట్లాడుతున్న మజ్జి ఆదినారాయణ

అనకాపల్లి: విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన విద్యను అందించాలని ఇంటర్మీడియట్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ మజ్జి ఆదినారాయణ అధ్యాపకులకు సూచించారు. గురువారం స్థానిక మెయిన్‌రోడ్డు ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లాలో వివిధ ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధ్యాపకులు ఉదయం 9లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఫేస్ రికగ్నిషన్ యాప్ ద్వారా అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు కోచింగ్ ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు. కళాశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలన్నారు. అనంతరం ఇక్కడ కళాశాలలో తరగతుల్లోకి వెళ్లి బోధన విషయంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ జిల్లా అధికారి మద్దిలి వినోద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

'పెన్షనర్ల సమస్యలు పట్టని ప్రభుత్వం'



పెన్షనర్ల సమస్యలపై మాట్లాడుతున్న అధ్యక్షుడు చంద్రమౌళి సోమేశ్వరరావు

యలమంచిలి రూరల్: పెన్షనర్ల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, నాలుగు డీఏల బకాయిలు ఊసెత్తడం లేదని పెన్షనర్ల సంఘం నాయకులు మండిపడ్డారు. పట్టణంలోని కోర్టు కూడలి వద్ద ఎన్‌జీవో హోంలో గురువారం సాయంత్రం యలమంచిలి తాలూక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి సోమేశ్వరరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు వి.జగన్నాథరావు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లపై చిన్నచూపు చూస్తోందని, ఒకటో తేదీకి పెన్షన్ సొమ్ము ఖాతాల్లో జమ అయితే చాలన్నట్టుగా పరిస్థితి ఉందని సోమేశ్వరరావు అభిప్రాయపడ్డారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల బకాయిల్లో కనీసం ఒకటైనా ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కోరుమిల్లి సుబ్బారావు, ఎస్.అప్పారావు, జి.కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు కె.సత్యారావు, జి.సాంబమూర్తి, పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

'స్పీకర్ కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు'



సమాధుల స్థలాన్ని పరిశీలిస్తున్న సమాజ్ వాదీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురవయ్య యాదవ్

నర్సీపట్నం: నర్సీపట్నం బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల స్థలంలో అక్రమ నిర్మాణాలు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కనుసన్నల్లోనే జరుగుతున్నాయని సమాజ్ వాదీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన గురవయ్య యాదవ్ ఆరోపించారు. బీఎస్పీ రాష్ట్ర నాయకుడు బొట్టా నాగరాజు, కాంగ్రెస్ నాయకుడు బొంతు రమణతో కలిసి ఆయన గురువారం అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చేతిలో మరణించిన బ్రిటిష్ అధికారుల మృతదేహాలను ఖననం చేసి సమాధులు నిర్మించారన్నారు. అల్లూరి పోరాట పటిమకు స్ఫూర్తిగా ఉన్న సమాధులను పరిరక్షించకుండా నాయకులు, అధికారులు ఆక్రమణదారులకు కొమ్ము కాస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో భూదందా, ఇసుక, మైనింగ్ మాఫీయ దందాలు పెచ్చుమీరాయన్నారు. కోర్టు ఆర్డర్ ఉందని మున్సిపల్ కమిషనర్ నోటితో చెప్పడం కాదని, చూపించాలని డిమాండ్ చేశారు. నాయకుల అండదండలతో నిర్మాణాలను ఆగమేఘాలపై నిర్మిస్తున్నారన్నారు. నిర్మాణాలను నిలువరించాల్సిన కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.

ప్రేమ ముసుగులో మోసం.. యువతులతో చెలగాటం

- అమ్మాయిలను నమ్మించి, ఆపై వీడియోలతో బ్లాక్ మెయిల్
- వలపన్ని నిందితుడిని పట్టుకున్న పోలీసులు

గోపాలపట్నం: ప్రేమ పేరుతో యువతులను వలలో వేసుకోవడం, పెళ్లి చేసుకుంటానని నమ్మించి వారితో సహజీవనం చేయడం, ఆపై రహస్యంగా తీసిన వీడియోలతో బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి డబ్బులు గుంజడం అలవాటుగా మార్చుకున్న ఓ ప్రబుద్ధుడిని గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేశారు. బాధితురాలైన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్నట్లు సీఐ ఎస్.వి. ప్రభాకర్ వెల్లడించారు. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం జోగంపేట గ్రామానికి చెందిన సరమడ శ్రీను ఉద్యోగాల పేరుతో పలు ప్రాంతాలకు వెళ్తూ అక్కడ యువతులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నాడు. ఇదే క్రమంలో గోపాలపట్నానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని ప్రేమ పేరుతో నమ్మించి, పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఆమెతో సహజీవనం ప్రారంభించాడు. శారీరకంగా కలిసిన సమయంలో రహస్యంగా వీడియోలు తీశాడు. కొంతకాలం తర్వాత తన అసలు స్వరూపం బయటపెట్టి, ఆ వీడియోలను అడ్డుపెట్టుకుని ఆమెను బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తీవ్రంగా వేధించాడు. ఆ వేధింపులు భరించలేక బాధితురాలు ధైర్యం చేసి పోలీసులను ఆశ్రయించింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడు శ్రీనును పట్టుకోవడానికి ప్రయత్నించారు. ఫోన్ ద్వారా సంప్రదించినా స్పందించకపోవడం, సాంకేతిక ఆధారాలతో కూడా చిక్కకపోవడంతో.. పోలీసులు పక్కా పథకం వేశారు. బాధితురాలి ఫోన్ నుంచే శ్రీనుకు మేసేజ్ పంపించి, నిర్దిష్ట ప్రదేశానికి రప్పించారు. ఆ ప్రదేశానికి శ్రీను రాగానే.. అప్పటికే అక్కడ మాటువేసిన పోలీసులు అతడిని వలపన్ని పట్టుకున్నారు.

విచారణలో విస్తుపోయే నిజాలు

పోలీసుల విచారణలో శ్రీను నేర చరిత్ర వెలుగులోకి వచ్చింది. అతను అమ్మాయిల కోసమే ఉద్యోగాల్లో చేరతాడు. ఇలా చాలా మంది యువతుల జీవితాలతో ఆడుకున్నట్లు తేలింది. గతంలో గోపాలపట్నంలో లక్ష్మీనగర్‌లో ఓ యువతిని ప్రేమించగా, విషయం ఇంట్లో తెలియడంతో ఆమె కుటుంబ సభ్యులు అతనికిచ్చి బలవంతంగా పెళ్లి చేశారు. కానీ కొన్నాళ్లకే శ్రీను మరో అమ్మాయితో సంబంధం పెట్టుకోవడంతో, అతని భార్య విడిచిపెట్టి వెళ్లిపోయింది. నిందితుడిపై గతంలో రెండో పట్టణ, గోపాలపట్నం పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. శ్రీను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

యువతులకు పోలీసుల హెచ్చరిక

ఈ సందర్భంగా సీఐ ప్రభాకర్ మాట్లాడుతూ యువతులు ఇలాంటి మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. 'ప్రేమ పేరుతో మోసం చేసేవారు మన చుట్టూనే ఉంటారు. వారి ప్రవర్తన, తీరును గమనిస్తే దురుద్దేశం అర్థమవుతుంది. కేవలం శారీరక సుఖం కోసం వెంపర్లాడే వారిని దరిచేరనివ్వద్దు. వారి వల్ల భవిష్యత్తు అంధకారమవుతుంది'అని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ, వారి బాగోగులను గమనించాలని సూచించారు. ఇంట్లో ప్రేమపూర్వక వాతావరణం ఉంటే పిల్లలు బయటి వ్యక్తుల ఆకర్షణలకు లోనుకారని సీఐ తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- రీసర్వే పనులు సమర్థవంతంగా పూర్తి చేయాలి
- సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు



రెవెన్యూ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.గోవిందరావు, జేసీ ఎం.జాహ్నవి

తుమ్మపాల: రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టాలని సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అడిషనల్ డైరెక్టర్ ఆర్.గోవిందరావు సూచించారు. కలెక్టరేట్‌లో జేసీ ఎం.జాహ్నవితో కలిసి అందరికీ ఇళ్లు, రీసర్వే, ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణ, పీజీఆర్ఎస్, ఎస్సీ బరియల్ గ్రౌండ్స్, కుల ధ్రువీకరణ పత్రాల జారీ వంటి అంశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వేను వేగవంతం చేసేందుకు గ్రామ సర్వేయర్లు, వీఆర్‌వోలు, మండల సర్వేయర్లు, డిప్యూటీ తహసీల్దార్లు మరింత ఉత్సాహంగా పనిచేయాలన్నారు. రీసర్వే ప్రక్రియలో ప్రభుత్వ, ప్రైవేటు భూముల నిర్ధారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 2027 డిసెంబరు నాటికి భూముల రీసర్వే ప్రక్రియ పూర్తి కావాలన్న లక్ష్యంతో అందరూ పనిచేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

- జిల్లాలో ప్రతి పేదవానికి సొంతిల్లు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని గోవిందరావు సూచించారు. తహసీల్దార్లు తప్పకుండా లేఅవుట్లను పరిశీలించాలన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి ఇంటి నిర్మాణం చేపట్టకపోతే వారికి 3 సెంట్లు మంజూరు చేయాలని కోరారు. వివాదాలు లేని ఆక్రమిత ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణపై ప్రజల్లో అవగాహన కల్పించి లబ్ధి చేకూర్చాలన్నారు. ఆక్రమిత ప్రభుత్వ భూమిలో ఇల్లు తప్పక నిర్మించి ఉండాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రం అందరికీ మంజూరు చేయాలని చెప్పారు. భూహక్కు పుస్తకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి పాతది తీసుకొని కొత్తది అందించాలని సూచించారు. ఎస్సీ బరియల్ గ్రౌండ్స్ కోసం స్థలాలు పరిశీలించి మంజూరు చేయాలన్నారు. జిల్లాలోని రెవెన్యూ వ్యవస్థ, ప్రజలకు అందిస్తున్న సేవలు, పలు అంశాలపై జేసీ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వై.సత్యనారాయణ, కేఆర్సీసీ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి, ఆర్డీవో ఆయిషా, సర్వే విభాగం ఏడీ గోపాలరాజా, ల్యాండ్స్ సెక్షన్ సూపరింటెండెంట్ రత్నం, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ వాసునాయుడు, కలెక్టరేట్ ఏఓ విజయకుమార్, మండల తహసీల్దార్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మట్టి గణపతులను పూజించాలి



మట్టి గణపతులను ప్రదర్శిస్తున్న కార్పొరేటర్ సునీత జానకీరామరాజు

అనకాపల్లి: వినాయక చవితిని పురస్కరించుకుని మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీ రామరాజు కోరారు. గురువారం స్థానిక నర్సింగరావుపేటలో అనకాపల్లి సామూహిక వినాయక నిమజ్జన కమిటీ చైర్మన్ ఆడారి కుమార్‌స్వామి ఆధ్వర్యంలో కార్పొరేటర్ దంపతులను శాలువాలతో సత్కరించి మట్టి గణపతులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడే విధంగా పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అల్లు త్రినాథ్, సోమశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి, కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మరమ్మతులు కారణంగా సరఫరా ఉండబోదని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, నూతలగుంటపాలెం, త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం, చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరు పాలెం, నరసాపురం, సోమవరం, ఏనుగుతుని, చిన్న ఏనుగుతుని, కన్నూరుపాలెం, పాత కన్నూరుపాలెం, తీడ, చెరకాం, జి. భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాలకు నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు. ఆయా గ్రామాల్లోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 8 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఈ విషయాన్ని గుర్తించి వినియోగదారులు, రైతులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

అనకాపల్లి: రైలు ఢీకొని తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వృద్ధుడి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు విశాఖపట్నం రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.టి.ఆర్. లక్ష్మి గురువారం తెలిపారు. అనకాపల్లి–కశింకోట స్టేషన్ల మధ్య వందేభారత్ రైలు ఢీకొనడంతోగుర్తు అతడు తీవ్రంగా గాయపడ్డాడన్నారు. దీంతో రైల్వే పోలీసులు ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. అతని గురించి ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని, ఆరెంజ్ రంగు షర్టు, తెల్ల రంగు ఫ్యాంటు శరీరంపై ఉన్నాయన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. సంబంధీకులు ఆచూకీ కోసం 7382058996ను సంప్రదించాలని సూచించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 50 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	000	000
రెండో రకం	3,550	3,550
మూడోరకం	3,100	3,500

అనకాపల్లి సినిమాలు

రాజా
: సార్ మేడమ్
సత్యనారాయణ స్క్రీన్-1:కింగ్ డమ్
సత్యనారాయణ స్క్రీన్-2 జూనియర్
పర్తిసాయి : మహావతార్ నరసింహ
వెంకటేశ్వర : లోపలకి రా చెప్పతా..
శ్రీ సత్య :తమ్ముడు
రామచంద్ర : హరి హర వీరమల్లు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8, బీ పాజిటివ్-22, ఓ పాజిటివ్-30, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 346 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 321 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

క్రీడా మైదానం.. అధ్వానం



క్రీడా మైదానంలో చోరీకి గురైన వ్యాయామ వీల్

- మౌలిక సదుపాయాలు కరువు
- మరమ్మతులకు గురైన వ్యాయామ పరికరాలు
- వాకర్స్, క్రీడాకారులకు ఇబ్బందులు
- ఎన్టీఆర్ క్రీడా మైదానం అభివృద్ధిపై ప్రభుత్వ నిర్లక్ష్యం



క్రీడా మైదానంలో అసంపూర్తిగా నిర్మించిన మరుగుదొడ్డి



వర్షపు నీటితో బురదగా మారిన క్రీడా మైదానం

అనకాపల్లి: పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానం అధ్వానంగా మారుతోంది. ఇక్కడ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఆటలు, ప్రధాన సమావేశాలు, పంద్రాగస్టు, గణతంత్ర వేడుకలు నిర్వహిస్తుంటారు. జిల్లాలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ మైదానాన్ని అభివృద్ధి చేయడంలో కూటమి పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దాంతో క్రీడాకారులకు వాకర్స్‌కు కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాయామ పరికరాలు మరమ్మతులకు గురైనా పట్టించుకున్న నాథుడే లేకపోయాడు.

మైదానంలో వర్షపునీరు....

మెయిన్‌రోడ్డులో కురిసిన వర్షపునీరు క్రీడా మైదానంలోకి చేరుతోంది. బయటకు పోయే మార్గం లేక పోవడంతో మూడు, నాలుగు రోజులు నిలిచిపోయి క్రీడాకారులు, వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మైదానంలో వర్షపు నీరు పూర్తిస్థాయిలో బయటకు పోయే మార్గాన్ని ఏర్పాటు చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

రోజూ వాకింగ్

కరోనా తర్వాత ప్రతి ఒక్కరూ వయసుతో సంబంధం లేకుండా నిత్యం వాకింగ్ చేస్తున్నారు. చిన్నారులు నుంచి వృద్ధులు వరకు వ్యాయామంపై దృష్టి సారించారు. రోజూ తెల్లవారుజాము 4.30 నుంచి ఉదయం 9 గంటల వరకూ, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకూ వందలాది మంది వాకర్స్ వస్తున్నారు. వాకింగ్ అనంతరం వ్యాయామ పరికరాలు ఉపయోగించుకుని వ్యాయామం చేస్తారు. క్రీడా మైదానంలో గతంలో ఏర్పాటు చేసిన వ్యాయమ పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. ఏడాది నుంచి వ్యాయామ పరికరాలు పాడైపోయినప్పటికీ వాకర్స్ జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదు.

మరుగుకు ఇక్కట్లు

క్రీడాకారులు, వాకర్స్‌కు క్రీడా మైదానంలో మరుగుదొడ్డి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2014 టీడీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ రూ.2.5 లక్షలు మంజూరు చేయగా, అసంపూర్తిగా మరుగుదొడ్డి నిర్మించి నిలిపివేశారు. పూర్తిస్థాయిలో మరుగుదొడ్డి నిర్మించాలని వాకర్స్, క్రీడాకారులు కోరుతున్నారు.

పైపులైన్లు వేయక తాగునీటి ఇబ్బందులు

ఎంతో ప్రాముఖ్యత కలిగిన క్రీడా మైదానంలో కనీసం తాగునీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. వైఎస్సార్‌సీపీ పాలనలో క్రీడాకారులు, వాకర్స్ కోరిక మేరకు సార్వత్రిక ఎన్నికల సమయంలో తాగునీటి మోటార్ బోరును ఏర్పాటు చేశారు. పైపులైన్లు ఏర్పాటు చేసినట్లయితే పూర్తిస్థాయిలో తాగునీరు అందుతుంది. దీనిపై జీవీఎంసీ అధికారులు తక్షణమే దృష్టి సారించాలి.

క్రీడా మైదానంలో జిల్లా క్రీడా కార్యాలయం..

జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత ఎన్టీఆర్ క్రీడా మైదానంలో జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థలను ఏర్పాటు చేశారు. జిల్లాలో వివిధ క్రీడాకారులకు సంబంధించిన వ్యాయామ ఉపాధ్యాయులు నిత్యం వస్తుంటారు. ఇంత ప్రాముఖ్యత కలిగిన క్రీడా మైదానంలో కనీస మౌలిక సదుపాయాలు లేవు. మైదానంలో మేడపైన సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు.



క్రీడా మైదానంలో మరమ్మతులకు గురైన వ్యాయామ పరికరం

క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలి



25 సంవత్సరాలుగా క్రీడా మైదానంలో వాకింగ్ చేస్తున్నాను. కానీ అభివృద్ధికి నోచుకోలేదు. క్రీడాకారులకు, వాకర్స్‌కు ఇక్కడ తాగేందుకు నీరు లేకుండా పోయింది. మరుగుదొడ్డి నిర్మించాలి. వర్షం పడితే క్రీడా మైదానం చెరువును తలపిస్తుంది. వర్షం తగ్గిన మూడు, నాలుగు రోజులు వరకూ క్రీడా మైదానం బురదగా ఉంటుంది. వ్యాయామ పరికరాలను బాగు చేయాలి.

– బి.రామకృష్ణ, క్రీడా మైదానం వాకర్, అనకాపల్లి

వ్యాయామ పరికరాలు బాగుచేయాలి



ఎన్నికల సమయంలో నాయకులు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వాకర్స్‌కు హామీలిచ్చారు. అధికారం చేపట్టిన తర్వాత ఇక్కడ మరమ్మతులకు గురైన వ్యాయామ పరికరాలు, తాగునీరు, మరుగుదొడ్డి సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారు. వర్షం పడితే మైదానం బురదగా మారుతోంది. మూడు, నాలుగు రోజులు వాకింగ్‌కు సెలవు ప్రకటించే పరిస్థితి ఏర్పడుతుంది. – వై.త్రినాథ్, వాకర్స్ గౌరవాధ్యక్షుడు, ఎన్టీఆర్ క్రీడా మైదానం

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

అనకాపల్లి: మండలంలో మామిడిపాలెం, పాపయ్యసంతపాలెం, పాపయ్యపాలెం, కొండుపాలెం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు విచ్చేయుచున్నట్లు తెలిపారు. ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు హాజరు కావాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సందడి



పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

అనకాపల్లి: ఏరా బాగున్నావా...ఏమి చేస్తున్నావు... ఇంకా బాల్య చేష్టలు పోలేదురా అంటూ.. గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్‌కు చెందిన 1990–91 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు సందడి చేశారు. గురువారం రాత్రి గవరపాలెం మరిడమ్మ ఆలయం వద్ద లండన్‌లో స్థిరపడిన పూర్వ విద్యార్థి కొణతాల గోపి ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక జరిగింది. చదువుకున్న రోజుల్లో వారు గడిపిన జ్ఞాపకాలను, అనుభవాలను ఒకరికొకరు గుర్తు చేసుకున్నారు. విద్యార్థి స్థాయి నుంచి తల్లిదండ్రులుగా ఎదిగి 35 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఇప్పటికే కొంత మంది పూర్వ విద్యార్థులు వివిధ దేశాల్లో స్థిరపడ్డారని, వచ్చే ఏడాది వారంతా ఇండియాకి వచ్చి స్కూల్లో కలుసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ఆక్రమించిన భారీ వాహనం

- వాహన చోదకులకు ఇబ్బంది



జాతీయ రహదారిపై వెళ్తున్న భారీ వాహనం

కశింకోట: స్థానిక జాతీయ రహదారిపై భారీ వాహనం మెషీన్‌తో వెళ్లడంతో ఇతర వాహనాల రాకపోకలకు గురువారం అంతరాయం కలిగింది. చోదకులు ఇబ్బంది పడ్డారు. అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు రోడ్డు డివైడర్ వరకు ఆక్రమించి వెళ్లడంతో దాని వెనుక వచ్చే వాహనాలు ముందుకు వెళ్లే అవకాశం లేకపోయింది. దాన్ని వెంబడించి అతి నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటువంటి వాహనాలను రద్దీగా ఉండే పగటి పూట రాకపోకలు సాగించకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



బాలింతకు పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ నాయుడు, రోటరీ క్లబ్ సభ్యులు

అనకాపల్లి: ప్రపంచ వ్యాప్తంగా రోటరీ క్లబ్‌లు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్, వైద్యుడు డి.డి. నాయుడు తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆస్పత్రి ఆవరణలో గర్భిణులకు, బాలింతలకు ఉచితంగా పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెలా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోలియో నిర్మూలనకు ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బెల్లం వర్తకుడు కోరుకొండ బుచ్చిరాజు, క్లబ్ పట్టణ అధ్యక్షుడు బుద్ద శ్రీనివాసరావు, కార్యదర్శి కేవీపీఎస్ ప్రకాష్, కోశాధికారి బీ సూర్యారావు, సభ్యులు పాల్గొన్నారు.

3 మద్యం షాపులు.. 30 బెల్టు షాపులుగా పాలన

అనకాపల్లి: సీఎం చంద్రబాబు ఏడాది పాలన అర్థ రహితంగా మారిందని ప్రజలను ఇంకా మోసం చేస్తూనే ఉన్నారని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమయ్యారని మాజీ కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాడి నారాయణరావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన 60 హామీలు పత్తాలేదన్నారు. మూడు సిలిండర్లలో ఒక దానితో మమ అనిపించారన్నారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఎప్పుడు ఇస్తారో సమాధానం లేదన్నారు. 20 లక్షల ఉద్యోగాలపై కాకమ్మ కబుర్లు చెబుతున్నారన్నారు. తల్లికి వందనం పథకం కుటుంబంలో ఎంతమంది చదువుకుంటే అంత మందికి ఇస్తామని చెప్పి కొంతమందికి మాత్రమే ఇచ్చారన్నారు. నేటికి నగదు పడని తల్లిదండ్రులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని వాపోయారు. 50 ఏళ్లు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు నెలకు రూ.4 వేల పింఛన్ ఊసేలేదన్నారు. 18 నుంచి 60 సంవత్సరాల ఆడబిడ్డకు నెలకు రూ.1500 ఇస్తామని ఇచ్చిన హామీ అడ్రస్ లేకుండా పోయిందన్నారు. మండలానికి మూడు మద్యం షాపులు.. 30 బెల్టు షాపులు అన్న చందంగా పాలన సాగుతుందని ఎద్దేవా చేశారు. అభివృద్ధిలో 3 మాటలు... 30 గ్రాఫిక్స్ డిజైన్లు, మొదటి ఐదేళ్లలో అరచేతిలో వైకుంఠం చూపిస్తే, ఇప్పుడు మళ్లీ అదే చేతిలో కైలాసాన్ని చూపిస్తున్నారన్నారు.

కశింకోటలో ఫీవర్ సర్వే



కశింకోట-3 హెల్త్ క్లినిక్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ దుర్గ

కశింకోట: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ఫీవర్ సర్వే, యాంటీ లార్వా సర్వే గురువారం నిర్వహించారు. వాతావరణ మార్పుతో సీజనల్ జ్వరాలు, వ్యాధులతో కేంద్రానికి వస్తున్న రోగులు ఎక్కువవుతున్న నేపథ్యంలో సర్వే చేశారు. వీటిపై ప్రజలకు ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్లలో అవగాహన సదస్సులు నిర్వహించారు. వైద్య శిబిరాలు నిర్వహించి సేవలందించారు. వైద్యాధికారి తిరుపతిరావు ఈ సందర్భంగా తాగునీటి నిల్వలు ఉన్న పాత్రలను ప్రతి వారం శుభ్రపరచుకోవాలని కోరారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించుకోవాలన్నారు. జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు వచ్చినప్పుడు ప్రభుత్వ ఆస్పత్రి, పీహెచ్‌సీలకు వచ్చి వైద్య సేవలు పొందాలన్నారు. సబ్ యూనిట్ అధికారి ఐ. శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ గురునాథ్ గుప్తా, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.



బావులను పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది



కశింకోటలో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న ఫీవర్, యాంటీ లార్వా సర్వే

3న ప్యాసా చిత్ర ప్రదర్శన

అనకాపల్లి టౌన్: అనకాపల్లి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 3న ప్యాసా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు సొసైటీ అధ్యక్షుడు తమ్మన సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి పాత బెల్లం మార్కెట్ వద్ద వైఎంవీఏ హాల్‌లో ఈ సినిమా ప్రదర్శన ఉంటుందన్నారు. టైమ్స్ పత్రిక జాబితాలో వంద గొప్ప చిత్రాల్లో ఒకటైన ఈ చిత్రాన్ని 1957లో ఆనాటి భారతీయ సినీ డైరెక్టర్ గురుదత్ దర్శకత్వం వహించారని కార్యదర్శి పి.ఎస్. అజయ్‌కుమార్ తెలిపారు. సినీ అభిమానులందరూ హాజరు కావాలని కోరారు.

అల్లు రామలింగయ్యకు ఘన నివాళి



అల్లు రామలింగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రజా నాట్యమండలి

అనకాపల్లి: స్థానిక సీపీఐ కార్యాలయంలో అల్లు రామలింగయ్య 21వ వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో రామలింగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి జిల్లా గౌరవాధ్యక్షుడు రాజాన దొరబాబు మాట్లాడుతూ అల్లు రామలింగయ్య ప్రజా నాట్యమండలిలో సుదీర్ఘకాలం పనిచేసి నాటక రంగంలో మంచి గుర్తింపు పొంది గరికపాటి రాజారావు ద్వారా సినీ రంగంలో ప్రవేశం చేశారన్నారు. పుట్టిల్లు సినిమాతో ప్రారంభమై చనిపోయే వరకు తనదైన శైలిలో ప్రజలందరినీ కడుపుబ్బ నవ్వించే హాస్యం ప్రదర్శించినట్లు కొనియాడారు. రామలింగయ్య స్వాతంత్ర్య సమరయోధుడని, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లి దేముడు బాబు, జిల్లా సహాయ కార్యదర్శి వియ్యపు రాజు, జిల్లా కోశాధికారి కొండూరి రవీంద్ర, జిల్లా సమితి సభ్యులు ఆళ్ల సత్తిరాజు, విత్తనాల పోతురాజు, కండుబోతు బుజ్జి, పప్పల ఈశ్వరరావు, మామిడి విష్ణు, బుగతా శంకరరావు, నరాలశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంపీడీవోకు ఘన సత్కారం



ఎంపీడీవో రవికుమార్ దంపతులను సత్కరిస్తున్న పార్టీ సమన్వయకర్త భరత్‌కుమార్

కశింకోట: ఎంపీడీవో వి.వి. రవికుమార్ గురువారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయలలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ దుశ్శాలువా కప్పి రవికుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఎంపీడీవోగా ఆయన అందించిన సేవలను ప్రస్తుతించారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, సర్పంచ్‌లు కలగ గున్నయ్యనాయుడు, మంత్రి జయరజని, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కరక శేషు, గణేష్, మిస్కా రమణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విగ్రహం తరలింపుకు చర్యలు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణలో భాగంగా మునగపాక మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న అభయాంజనేయస్వామి విగ్రహాన్ని తరలించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం ఆంజనేయ మూల సంఘ రైతులు సమావేశమయ్యారు. కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని నెలకొల్పి ఏటా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అయితే పూడిమడక రోడ్డు విస్తరణలో విగ్రహం తొలగించాల్సి రావడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్, కార్యక్రమంలో పాల్గొన్న సీఆర్టీలు

సబ్బవరం: చదువుకు, సిలబస్‌కు తేడా ఉందని, విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని ఆర్జేడీ విజయభాస్కర్ తెలిపారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో కేజీబీవీ తెలుగు సీఆర్టీలకు గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, పలు అంశాలను వివరించారు. చేసే ప్రతి పని పట్ల అంకిత భావం కలిగి, ఆనందంగా, మనస్ఫూర్తిగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు, జిల్లా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఆర్.జయప్రకాష్, స్టేట్ అబ్జర్వర్ శేషగిరిరావు, జీసీడీవో ఏఎస్‌డీ జమున తదిరులు పాల్గొన్నారు.

క్వారీని పూర్తిగా మూసివేయాలి

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం, జి.కోడూరు క్వారీ బాధిత దళిత రైతులు చేస్తున్న నిరాహారదీక్షలకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు సంఘీభావం తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ తొమ్మిది రోజులుగా నిరాహారదీక్షలు జరుగుతున్నా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పందించకపోవటం దురదృష్టకరమన్నారు. అధికారులు సైతం వారి సమస్యలను పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం అన్యాయమన్నారు. రెవెన్యూ యంత్రాంగం మైనింగ్ మాఫియా కోసం పని చేస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ క్వారీని రద్దు చేయాలని పట్టుబట్టిన టీడీపీ నాయకులు, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదే క్వారీకి అనుమతులు తెచ్చుకోవటం సిగ్గుచేటు అన్నారు. దళిత ఓట్లు కావాలి కానీ వారి గోడు పట్టించుకోరా అన్నారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే చేయాలి



రాయపుర అగ్రహారంలోని లేఅవుట్‌ను పరిశీలిస్తున్న సర్వే ఏడీ గోవిందరావు

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లిలో రీ సర్వేను సర్వే సబ్ డివిజనల్ అడిషనల్ డైరెక్టర్(అమరావతి) ఆర్. గోవిందరావు(ఐఏఎస్) గురువారం పరిశీలించి, గ్రామ సభలో పాల్గొన్నారు. రైతుల సమక్షంలో రీ సర్వే సమగ్రంగా నిర్వహించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. రాయపుర అగ్రహారంలో గతంలో ఏర్పాటుచేసిన గృహ నిర్మాణ లేఅవుట్‌ను పరిశీలించారు. గృహ నిర్మాణాలు చేపట్టకపోవడంపై లబ్ధిదారులను ఆరా తీశారు. జీవో నెం.30లో భాగంగా మండలంలో గృహ నిర్మాణాల క్రమబద్ధీకరణపై విచారణ చేపట్టారు. 2019కి ముందు ప్రభుత్వ భూముల్లో చేపట్టిన గృహ నిర్మాణాలను క్రమబద్ధీకరించనున్నట్లు తెలిపారు. మండలంలో ఏయే గ్రామాల్లో ఎన్ని గృహాలు ఉన్నాయో వివరాలు తెలుసుకున్నారు. ఆర్డీవో షేక్ ఆయేషా, ఏడీ సర్వేయర్ గోపాలకృష్ణ, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ ఉన్నారు.